విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

వైసీపీ నుండి రాష్ట్రాన్ని, బీజేపీ నుండి దేశాన్ని కాపాడండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - మధురవాడ: వైసీపీ రాక్షస, రౌడి పాలన నుండి రాష్ట్రాన్ని రక్షించడంతో పాటు బీజేపీ మతోన్మాద పాలన నుండి దేశాన్ని కాపాడండి నినాదంతో సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరగనున్న సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ మధురవాడ జోన్ 7వ వార్డు పరిధిలో కళానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విభిన్న మతాలు, కులాలు, సంస్కృతులతో భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశ ప్రజలను విభజించి మత ప్రాతిపదికన మతోన్మాదాన్ని రెచ్చగొట్టి పరిపాలన సాగిస్తుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కేంద్రం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలు ఏమాత్రం వ్యతిరేకించకుండా తగుదునమ్మా అంటూ అమలు చేసి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, అదనపు వడ్డీలు, సర్ చార్జీలు పేరిట అధికంగా వసూలు చేస్తూ ప్రజలపై భారాన్ని మోపుతున్నారని ధ్వజమెత్తారు. 4 వేలకు పైగా విద్యార్థులతో జాతీయ రహదారి పక్కనే వున్న చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు పై వంతెన నిర్మించి ఆదుకోవాల్సింది పోయి ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి మరింత దూరం తిరిగి వెళ్ళేటట్లు చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా పార్టీ కార్యదర్శి వాండ్రాశి సత్యనారాయణ, ఎం.డి.బేగం, జి.వేళంగిణిరావు, ఎం.ఎస్.పాత్రుడు, ఎస్.త్రినాథ్, కె.చిన్న, డి.సతీష్, నారాయణరావు టీడీపీ నాయకులు ఎన్.రాము, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీతో విధులు నిర్వహిస్తే ఫిర్యాదులా....?

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దర్శనానికి అందరూ ప్రముఖులే. టిక్కెట్ తీసుకున్న భక్తులకు మాత్రం స్వామివారి దర్శనం అంతంత మాత్రమే. వారి తాలూకా వీరి తాలూకా అంటూ ఔట్ సోర్సింగ్ సిబ్బంది, శాశ్వత సిబ్బంది స్వామివారి దర్శనం సామాన్య భక్తులకు కలగనివ్వడం లేదు. స్వామివారి దర్శనానికి ఉచిత, రూ.100/-, (నీలాద్రి గుమ్మం వరకు), రూ.300/- (అంతరాలయ దర్శనం) ఉన్నాయి. భక్తులు మాత్రం ఓ క్రమ పద్ధతిలో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన క్యూలైన్లలో వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుంటారు. అయితే క్రమ పద్ధతిలో దర్శనానికి వచ్చిన భక్తులకు మాత్రం స్వామివారి దర్శనంకు వీలు లేకుండా ప్రక్కనే ఉన్న ఏఈఓ, సూపరింటెండెంట్ల వద్ద అనుమతి తీసుకోకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బంది, శాశ్వత సిబ్బంది కనీసం రూ.100/-ల టిక్కెట్ తీసుకోకుండా అడ్డదారిలో స్వామివారి దర్శనం చేయిస్తున్నారని భక్తులు వాపోయారు. ఇక్కడి నుండి బదిలీపై వెళ్లిన ఏఈఓ తాలూకా అని ఆలయ సూపరింటెండెంట్ వద్దకు ఓ వ్యక్తి వచ్చి సుమారు 8 మందికి దర్శనం కావాలని అడుగగా అందుకు ఆ సూపరింటెండెంట్ పి.ఆర్.ఓ ఆఫీస్ వద్ద 4 రూ.100/-ల టిక్కెట్లు తీసుకురండి అంతరాలయం లోపలికి పంపుతాను అన్నారు. అందుకు ఆ వ్యక్తి సదరు బదిలీపై వెళ్లిన ఏఈఓకు ఫోన్ చేయగా సదరు అధికారి ఎవరి ద్వారానో ఉచితంగా లోపలకు (దర్శనానికి) వెళ్ళిపోయారు. అంటే నెల అయ్యేసరికి జీతాలు వచ్చేయాలి టిక్కెట్లు మాత్రం తీయించరు అంటూ కొంతమంది నాలుగవ తరగతి సిబ్బంది అంటున్నారు. ఇందుకు కారణం ఏళ్లకు ఏళ్ళు ఔట్ సోర్సింగ్ సిబ్బంది, శాశ్వత సిబ్బంది ఒకే స్థానంలో బదిలీ కాకుండా ఉండటమే కారణం. ఇటవల ఓ సూపరింటెండెంట్ సిబ్బంది, పాలక మండలి సభ్యులు, ఔట్ సోర్సింగ్ వారి తాలూకా అంటూ లేదా వారు ఎవరినైనా దర్శనానికి వస్తే టిక్కెట్ తప్పని సరి అని చెప్పగా ఓ వ్యక్తి ఏకంగా రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఉన్న ఫలంగా ఆ సూపరింటెండెంట్‌ను వేరే విభాగానికి బదిలీ చేయమని వత్తిడి తీసుకు వచ్చారని అందుకు కమిషనర్ ఈఓకు ఫోన్ చేసి ఏం జరిగింది అని అడుగగా ఆయన పని ఆయన చేస్తున్నారు తప్పేమీ లేదని ఈఓ సమాధానం చెప్పారని తెలిసింది. ఫిర్యాదు చేసిన విషయం తెలిసి సదరు వ్యక్తికి ఓ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మందలించినట్లు సిబ్బంది గుస గుసలు ఆడుకుంటున్నారు.

సెల్ టవర్ నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం

విశాలాంధ్ర - ఆనంద పురం: ఆధునిక కాలంలో ఈ పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్న తరుణంలో మండలంలో కొన్ని గ్రామపంచాయతీలలో ఇప్పటివరకు కూడా కనీసం మొబైల్ సిగ్నల్ టవర్లు కూడా వేసుకోలేని పరిస్థితులు ఉన్నాయి. వివరాల్లోకెళ్తే ఆనందపురం మండలంలో రామవరం గ్రామ పంచాయతీలో ఉన్న ప్రజలకు ఇప్పటివరకు సెల్ టవర్ లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కూడా ఇక్కడ టవర్ ఏర్పాటుకు ఏ ప్రభుత్వం నోచుకోలేదు. కానీ స్థానిక ప్రజలు పట్టుదలతో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు ఆమోదం లభించింది. అందులో భాగంగా ఆదివారం గ్రామ సర్పంచ్ యర్ర రాజు ఆధ్వర్యంలో టవర్‌కు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యర్ర రాజు, వార్డు మెంబర్లు గుర్ల కనకరాజు, అక్కిరెడ్డి రమణ, అంగరపు గంగరాజు, రమణ, పరమేశ్వరరావు, తాత, దేవుడు బాబు, యర్ర రాము, గౌరీ నాయుడు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీఓను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - పెద బయలు: ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరిని సస్పెండ్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ గెస్ట్ ఆఫీస్ నుండి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్ వద్ద రాస్తారోకో చేపట్టారు. సీడీపీఓ వేధింపులకు గురిచేస్తూ దాడులకు పాల్పడిన పీఓను వెంటనే అరెస్టు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ సీడీపీఓ తనిఖీల పేరుతో అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడి సిబ్బందిని దుర్భాషలాడుతున్నారని అన్నారు. తక్షణమే పీఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బీచ్ క్లీనింగ్

విశాలాంధ్ర - మధుర వాడ: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, టాటా గ్రూప్‌తో కలిసి ఆదివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజం, ప్రకృతి దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ షంషుద్దిన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వివిధ గ్రూప్‌లుగా ఏర్పడి ఆర్‌కెబీచ్‌లో ఉన్న చెత్తను సేకరించి జీవీఎంసీకి అందజేశారు.

24న జనసేన నియోజకవర్గ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 24వ తేదీన జనసేన పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు జనసేన నాయకుడు, మాజీ ఎంపీటీసీ సాయిబాబా దురియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జన సైనికులు ఆలోచన మేరకు భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాల్లో భాగంగా ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు సకాలంలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పురుగుల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామంలో ఆదివారం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు పంటలలో పురుగుల నివారణకు ఫిరమెన్ ట్రాప్స్ పసుపు తెలుపు ప్లేట్లు, జీవామృతం కవర్లు సిద్ధం చేయడం జరిగింది. ఫిరమెన్ ట్రాప్స్ వలన కాండం తొలిచే పురుగులు నివారణ అవుతుందని, పసుపు తెలుపు ప్లేట్లు పంటలో వచ్చే దోమ పోటు నివారణ అవుతుందని, గట్లు మీద కంది, బంతి ఎరపంటలు వేయడానికి జొన్న, మొక్కజొన్న, సజ్జలు రక్షణ పంటగా వేయడానికి విత్తనాలు సిద్ధం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ గండి శ్రీనివాసరావు, ఆర్‌బికె ఇన్‌చార్జ్ వి.కమల, గ్రామ పెద్దలు అప్పాన భాస్కరరావు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు పాయకరావుపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చిత్రమందిర్ సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి టెక్నాలజీ రంగాన్ని పరిచయం చేసిన మహానుభావులని, స్థానిక ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పన, యువత రాజకీయాల్లోకి రావాలని 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన దూరదృష్టి మేధావని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలవరపు అప్పలరాజు, గారా సూర్యారావు, కక్కల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగా ఉండి చేయలేనిది ఎమ్మెల్యేగా నేను చేశా

పెట్ల ఉమా శంకర్ గణేష్

విశాలాంధ్ర - గొలుగొండ.: 40 సంవత్సరాల ఇండస్ట్రీ అని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణంలో అనుమతులు తీసుకురాలేకపోయావు కానీ మాపై విమర్శల అంటూ నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలోనే జీవోలు, నిధులు మంజూరు చేశామని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు గొప్పలు చెప్పుకోవడం చూస్తే హాస్యాస్పదంగా ఉందని జగనన్న ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేస్తే టీడీపీ ప్రభుత్వంలో నిధులు వచ్చాయని చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా సమపాళ్లలో జరుగుతుందన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సు లోయలో పడిన ఘటన ప్రదేశాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఆర్టీసీ, పోలీస్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను అమర్నాథ్ కోరారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 10 లక్షల రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని ఆయన చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్‌తో సహా 34 మంది బస్సులో ఉన్నారని, అందులో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారని, మిగిలిన 32 మందిలో ఆరుగురును మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలించామన్నారు. మిగిలిన 26 మందిలో 21 మంది పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, స్థానిక శాసనసభ్యులు కె.భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లి బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ సభకు వెళ్తే పింఛన్లు తీసేస్తామని బెదిరింపులా...

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర - చింతపల్లి: మారుమూల ప్రాంతాల గిరిజనులకు ఉపయోగపడే రహదారులను నిర్మించకుండా మన్యంలో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను దోచుకునేందుకే విశాలమైన రహదారులు నిర్మిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో తలపెట్టిన ప్రచార జాత బస్సు యాత్ర చింతపల్లి చేరుకున్న సందర్భంగా ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ నిర్వహిస్తున్న సభకు వెళ్లితే పింఛన్లు, సంక్షేమ పథకాలు ఆపేస్తామని కొందరు వ్యక్తులు బెదిరించారని, పథకాలు ఏమైనా పాలకులు తమ పార్టీ కార్యాలయం నుంచి ఇస్తున్నారా, లేదా మీ నాయకులు దోచుకున్నది ఇస్తున్నారా అని దుయ్యబట్టారు. బస్సు యాత్రలో ఎక్కడా తమకు జగనన్న కాలనీలు కనిపించలేదని, గిరిజన ప్రాంతంలో అటువంటి జాడలేదన్నారు. రూ.1.80 లక్షలు ఇచ్చి సెంటు జాగాలో ఇల్లు కట్టుకోమంటున్నారని, పాలకులు మాత్రం ఎకరాల్లో భవనాలు కట్టుకుంటారని విమర్శించారు. మన్యప్రాంతాల్లో రూ.10 లక్షలతో ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పలు పాఠశాలలు మూసివేస్తూ నూతన విద్యా విధానానికి తెరలేపి, విద్యావిధానాన్ని అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు, విమల, లెనిన్ బాబు, జాన్సన్ బాబు, పేట్ల పోతురాజు, రాజబాబు, ఎంపీటీసీ సేగ్గే సత్తిబాబు, కంకిపాటి సత్తిబాబు, జల్లి రాజబాబు, అమర్, కూడా రాధాకృష్ణ, గంజారి రమణ తదితరులు పాల్గొన్నారు.

గత స్మృతులకు చిహ్నాలు ఛాయాచిత్రాలు

రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జీవితంలో మరుపురాని సన్నివేశాలను, గత స్మృతులను గుర్తుకు తెచ్చేవి ఛాయా చిత్రాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా వైజాగ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ స్థానిక విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను మంత్రి అమర్నాథ్ ఆదివారం తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటో జర్నలిస్టులు అత్యంత కఠినమైన పరిస్థితుల్లో కూడా విధులు నిర్వర్తిస్తూ సాహసోపేతమైన పరిస్థితుల మధ్య కీలకమైన ఫోటోలు కెమెరాలలో బంధించి బాహ్య ప్రపంచానికి తెలియజేస్తూ ఉంటారని అన్నారు. అంతేకాకుండా ప్రకృతి అందాలను ప్రజలందరికీ కళ్లకు కట్టినట్టు చూపించే ఫోటోగ్రాఫర్లు అభినందనీయులని అమర్నాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీలో అవార్డు సాధించిన వారిని మంత్రి అమర్నాథ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు పివిఎస్ మూర్తి, కార్యదర్శి జి.తిరుపతిరావు, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కెఆర్ దీపక్, కే.రామకృష్ణ, ఎస్కే రఫీ, రాజా, విజయ్ కుమార్, మురళి, శ్రీను, విశ్వేశ్వర్ రెడ్డి, రాజేష్, వేణు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

22న విజయవాడలో ధర్నా జయప్రదం చేయండి: కోన లక్ష్మణ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మున్సిపల్ శాఖలో 60 ఏళ్ళు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజయవాడ సీఎండీఏ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పాడని విమర్శించారు. కార్మికుల పక్షాన సమ్మె చేపట్టి ఏడాది దాటినా.. ఏ ఒక్క సమస్యపై కూడా సీఎం జగన్ స్పందించలేదని దుయ్యబట్టారు.

కార్మికుల సమస్యలపై అర్జీలు తీసుకొని 50 రోజులు దాటినా కార్మికుల పిఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈనెల 22న విజయ వాడ సిడిఎంఎ కార్యాలయం ఎదుట ధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున విజయవాడకు కదలిరావాలని పిలుపునిచ్చారు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలం మారుమూల రొంపల్లి పంచాయతీ బూరుగ, చినకోనేల గ్రామాల్లో అన్యాక్రాంతం అయిన గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని జెడ్పీటీసీ దీసరి గంగరాజు పేర్కొన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్లు రద్దు చేయాలని, గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్న భూస్వాములు, రియల్ ఎస్టేట్‌లపై క్రిమినల్ కేసులు పెట్టాలని అన్నారు. బూరుగ, చినకోనేల గ్రామాల్లో 60 గిరిజన నిరుపేద కుటుంబాలు తరతరాలుగా భూములను నమ్ముకొని జీవిస్తున్నారని అన్నారు. ఆ భూములపై భూస్వాములు, రియల్ ఎస్టేట్ మాఫియాల కన్నుపడి వారికి తెలియకుండానే భూములు అమ్మినట్టు తెలిపారు. ప్రాంతాలను అ గ్రామాలను,అ భూములను నమ్ముకొని గిరిజనులు తరతరాలుగా వారి తాతముత్తల నుండి జీవిస్తున్నారు. వారి భూములపై భూస్వాములు,రియల్ ఎస్టేట్ మాఫీయాల కన్ను పడి వారికి తెలియకుండానే గిరిజనులు భూములు వారు అన్యాయంగా తీసుకుని అమ్మినట్టు తెలిపారు. గిరిజనుల భూముల అన్యాక్రాంతం విషయంపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించి గిరిజనుల భూములకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మామిడి కృష్ణ, నరాజి సురేష్, వార్డు మెంబర్ సోమెల అప్పలరాజు, కోటపర్తి సింహాచలం, జన్ని శంకర్, పెంటయ్య, సన్యాసిరావు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

విశాలాంధ్ర - పరవాడ: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని ముఠా కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కె.వెంకునాయుడు డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకునాయుడు మాట్లాడుతూ పనిగంటలను సైతం లెక్కచేయకుండా ముఠా కార్మికులు ప్రభుత్వాదాయంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ముఠా కార్మికులను ప్రభుత్వాలు కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ, భోనస్, బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఠాకార్మిక సంఘం సిఐటియు నాయకులు కర్రి పోతునాయుడు,ఆడారి రాజు, పి.చిన్నారావు, దేముడు, కె.రబాబు. సత్తిబాబు, రాము, రమణ, ముత్యాలు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై పోరాటం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు తెలిపారు. బెంగుళూరులో జరిగిన మత్స్యకార సంఘం గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్‌గా ముంబాయికి చెందిన నందకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్ర మాలకు మోసా అప్పలరాజును ఘనంగా సన్మానించారు. అప్పలరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తీరం వెంట ఏర్పాటు చేసిన పరిశ్రమల వల్ల సముద్రంలో మత్స్యసంపద నాశనం అవుతుందని తెలిపారు. దీని కారణంగా మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని తెలిపారు. మత్స్యకార రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం కార్యదర్శి అనంత నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాందేపురంలో భూ తగాదా

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం బాందేపురం గ్రామానికి సంబంధించి భూ తగాదాపై గ్రామానికి చెందిన దండు నరసింహరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సీఐ సన్యాసి నాయుడు ఇచ్చిన సమాచారం మేరకు దండు నరసింహరాజు తండ్రి ద్వారా పిత్రార్జితంగా వచ్చిన భూమి ఎవరికి వారు వ్యవసాయం చేసుకుంటున్నారు. భాందేపురం గ్రామానికి చెందిన ఇందుకూరు శ్రీనివాస రాజు, ఇందుకూరు వెంకట సత్యనారాయణ రాజు, దండు కృష్ణంరాజు, అడ్డాల రవి వర్మ, అడ్డాల రాజా వర్మపై ఫిర్యాదు అందింది. ఈ ఐదుగురు వ్యక్తులు ఫిర్యాదుదారుడు ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ పర్యవేక్షణలో ఏఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో నగలు చోరీ

విశాలాంధ్ర - భీమిలి: ఆనందపురం మండలం ముకుందపురం దగ్గర పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మెడలో నగలు చోరీకి గురయ్యాయి. ఐదుగురు వ్యక్తులు రెండు వేర్వేరు ద్విచక్ర వాహనాలపై గాజువాకలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. వారిలో ఓ జంట విజయనగరం పెద్దపల్లి వీధికి చెందిన శతగోపం బాలరాజు, శ్రీనివాసులమ్మ బంధువులతో కలిసి గాజువాక ఫంక్షన్‌కు బైక్‌పై తిరిగి వస్తుండగా ఆనందపురం మండలం ముకుందపురం జంక్షన్ సమీపంలో వెనుక నుండి వస్తున్న టీవీఎస్ అప్పాచి బైక్‌పై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మహిళ మెడలో బంగారం వస్తువులు తెంపుకొని పారిపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆనందపురం క్రైమ్ ఎస్ఐ మన్మథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: పాడేరు ఘాట్ రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాద సంఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం పాడేరు ఘాట్ రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాదంపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్‌కు ఫోన్ చేసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రు లకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. అవసరం అయితే విశాఖపట్నం తరలించి మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు.

కిట్లంగి కృష్ణకు అండగా సీపీఐ

రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్



విశాలాంధ్ర - జీకే వీధి: గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు కిట్లంగి కృష్ణను ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆదివారం పరామర్శించారు. రింతాడ పంచాయతీ ఊబ పాలం గ్రామంలో క్రిష్ణ ఇంటికి వెళ్లిన ఆయన లేవలేని స్థితిలో ఉన్న కృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో సీపీఐ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన కృష్ణ ప్రస్తుతం అనారోగ్యంతో ఇంటికే పరిమితం కావడం బాధాకరమన్నారు. ఆయనకు పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడవద్దు అని ధైర్యం చెప్పారు.

సరైన రహదారి లేక తీవ్ర ఇక్కట్లు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: సరైన రహ దారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులు మండలం లోని కంద్రుం పంచాయతీ జంకర వలస గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి సమీపంలోని కిలోమీటర్ వరకు మట్టి ఉండడం వలన వర్షానికి పూర్తిగా బురద మయంగా మారి చాలా ప్రమాదకరంగా ఏర్పడింది. వాస్తవానికి బ్రిడ్జి ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. భారీ వర్షాలు కురవడంతో మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా ఏర్పడింది. బ్రిడ్జి సమీపం నుండి తారు రోడ్డు వరకు ఆనుకొని ఉన్న మట్టి రోడ్డు వీలైనంత త్వరగా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేసి మంచి రోడ్డు వేయాలని ఆయా చుట్టుపక్కల గ్రామస్తులు కోరుకుంటున్నారు.

డీసీఈబీ మెంబర్‌గా డా. ఖాసీం

విశాలాంధ్ర - కె.కోటపాడు: జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు మెంబర్‌గా స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ 'అపుస్మా' ఐటీ విభాగం రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఖాసీం నియమితులయ్యారు. ఆయనతోపాటు ఎలమంచిలి శ్రీ గౌరీ విద్యానికేతన్ కరస్పాండెంట్ "అపుస్మా" అనకాపల్లి జిల్లా కోశాధికారి బీశెట్టి వరప్రసాదరావు ను కూడా నియమించారు. వీరితోపాటు ఈ బోర్డులో మరో 16 మంది విద్యారంగానికి చెందిన ప్రముఖులను ఎంపిక చేశారు. ఈ మేరకు వారందరికీ జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు అందించారు.



డీఈవో వెంకట లక్ష్మమ్మ చైర్మన్‌గా వ్యవహరించిన ఈ కమిటీలో వైస్ చైర్మన్‌గా డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి వ్యవహరిస్తారు. అలాగే మరో ఆరుగురు ఎక్స్ అఫీషియో మెంబర్లుగా అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్లకు చెందిన అధికారులను నియమించారు. డాక్టర్ ఖాసీం, బి.వరప్రసాదరావులు డిసిఇబి సభ్యులుగా నియమితులు కావడం పట్ల "అపుస్మా" రాష్ట్ర కోశాధికారి ఎంవి రావు, విశాఖ అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు డాక్టర్ సుంకర శ్రీనివాసరావు, నల్లపురెడ్డి సీతారామరాజులు హర్షం వ్యక్తం చేశారు. డీఈఓ వెంకట లక్ష్మమ్మకు నూతన సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

NOTICE

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT BOBBILI

E. A. 34 / 2022 in E.P. / 2022 in O. S. 4 / 2012

Between:

Chinta Krishna and 5 others ...Petitioners/D.Hrs.

And:

Chinta Gopalam (Died) and 13 others ..Respondents

To

J.Dr. 12. Chinta Appalanaidu s/o late Gopalam, Hindu, aged 50 years, C/o Chinta Laxmana, Door No. 65-4-428/1, Santhigiri Colony, Gajuwaka, Visakhapatnam. Mobile No.9490793948.

J. Dr.14. Chinta Laxmana s/o late Gopalam, Hindu, aged 44 years, residing at Door No. 65-4-428/1, Santhigiri Colony, Gajuwaka, Visakhapatnam. Mobile No. 7780576827.

Take Notice that the application filed by the above Petitioners for adding you as J. Drs. 12 and 14, being the Legal Representative of deceased 1st Dr./Defendant, is stood posted for hearing at 10-30 A.M. on 30-8-2023 before the above said Court. Since you have been avoiding the notice, the Honorable Court was pleased to order substituted service through paper publication. As such you are directed to attend before the court on that day either in person or by a duly instructed pleader and if you fail to appear, you will be set ex parte and further steps will be taken by the Honorable Court.

/ By Order of the Honourable Court /
Bobbili,
Dated 19-8-2023.

M. Simhachalam
Advocate of the Petitioner

రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి కాంగ్రెస్ , చైర్ పర్సన్ మరియు అరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ఆధ్వర్యంలో భారతరత్న మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. 79వ. జన్మదిన వేడుకలు ఘనంగా కేక్ కట్ చేసుకుని కాంగ్రెస్ పార్టీ శ్రేణు లతో సంబరాలు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పూజారి రామారావు, జిల్లా ఉమెన్ రైట్స్ అధ్యక్షులు బంగారు రాజు, హుకుంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమర్బ లక్ష్మీనారాయణ పడాల్, మండల ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్, మండల మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సీదరి రాధలక్ష్మి, బోయి మోహన్ రావు, మజ్జి కొండ బాబు, కె.కోటేశ్వరరావు, వంతల రామకృష్ణ, అశర అప్పలనాయుడు, కుదా రామలింగం, బకురు ధర్మరాజు, రమేష్, రఘురాం, ఎస్.భగత్రం, పి గంగాధర్, టి పర్సురాం, టి సత్తిబాబు, వెంకట్ బాబు, టి బిమరావు, మహిళా నాయకురాలు జి పద్మ ,కె మితుల,కె గుల్సన్ మహిళాలు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వి.మాడుగుల: మాజీ ప్రధాని జయంతి వేడుకలు ఆదివారం మాడుగులలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ

కోఆర్డినేటర్ పడాల కొండలరావు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రావిచెట్టు జంక్షన్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పడాల కొండలరావు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బుడబండి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పుట్టా గుప్తాజి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏసు రాజు, బిసి సెల్ అధ్యక్షులు బాలిబోయిన అప్పారావు, దంగేటి శ్రీను, కొట్యాడ గాంధీ, రాపెటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెందుర్తి: రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పెందుర్తి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. పెందుర్తి నాలుగు రోడ్ల జంక్షన్లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఆదారి రమేష్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ షేక్ షఫీ ఉల్లా, పెందుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మోజి

లక్ష్మాజి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

బొలెరో వాహనాన్ని ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చింతూరు: ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొని ఆదివారం రాత్రి మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం పాల్వంచకు చెందిన జరుపుల కుమార్ అనే వ్యక్తి ఆన్లైన్ బిజినెస్ నిమిత్తం చింతూరు వచ్చాడు. తెలుగు ప్రయాణంలో ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని చట్టి గ్రామం వద్ద ఆగి ఉన్న బొలెరో ఢీకొనటంతో అక్కడ దగ్గరే మృతి చెందాడు. చింతూరు ఎస్ఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు సాగిస్తున్నారు.

సామూహిక లక్ష్మీ గణపతి హెూమం

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన పురాణ చరిత్ర ప్రసిద్ధి చెందిన స్వయం భూ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణ శుద్ధ చవితి పురస్కరించుకుని ఆదివారం భక్తుల చే సామూహికంగా శ్రీ లక్ష్మీ గణపతి హెూమము నిర్వహించినట్లు

ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేశారు. ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాలు ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణ అధికారి ఎస్.వి.వి సత్యనారాయణ మూర్తి చేసినట్లు తెలిపారు.

ఘనంగా భూలోకమాత ఉత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: భూలోక మాత పండగ సందర్భంగా ఆదివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ధూప ,దీప ,నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఉత్సవంగా వివిధ పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అలాగే అమ్మవారి ఊరేగింపు వీధుల్లో చేపట్టామని ఉత్సవ కమిటీ అధ్యక్షులు మీసాలు అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర -పెందుర్తి : గ్రేట్ థాట్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం వేపగుంట శ్రీ ముత్యమాంబ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ వైద్యులచే అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేట్ థాట్స్ ఆర్గనైజర్ లీలాధర్ టీం, పువ్వాడ త్రినాధ్,తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో క్రీడలు పట్ల ఆసక్తి పెరగాలి

విశాలాంధ్ర - పెందుర్తి: పిల్లల్లో క్రీడలు పట్ల ఆసక్తి పెరగాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పెందుర్తిలో విశాఖ లైన్స్ షాటకన్ కరాటే దు అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి కాలంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఉందని వాటిని సద్వినియోపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ 96వ, వార్డు కార్పొరేటర్ పీల శ్రీనివాసరావు 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ప్రేమ్ కుమార్ నిర్వాహకులు హరినాథ్ రెడ్డి గణపతి రెడ్డి గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

వాసవీమాతా ఆలయానికి కుర్చీలు, బెంచీలు వితరణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం జంపెన వాసవి మాత ఆలయానికి పలువురు దాతలు కుర్చీలు, బెంచీలు వితరణగా అందజేశారు. వాటిలో 25 కుర్చీలు ఓమ్మలి గ్రామానికి చెందిన పుట్ట రవి అందజేశారని ఆలయం అధ్యక్షుడు మోహన్ రావు తెలిపారు. అలాగే మరో 10 కుర్చీలను ఖండివరం గ్రామానికి చెందిన కొట్టేడ చిన్న నాగ, మరో ఐదు కుర్చీలను పాలకుర్తి అఖిల్ అందజేశారన్నారు. అలాగే మూడు బెంచీలను దాతలు అందజేశారని, వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

ఆదివాసి మహిళలను వివాహాలు చేసుకుని గిరిజనేతరుల చలామణి

సమగ్ర విచారణ జరపాలి

విశాలాంధ్ర - అరకులోయ: ఆదివాసి గిరిజన ప్రాంతంలో పాగా వేయడానికి గిరిజనేతరులు అమాయకమైన గిరిజన అమ్మాయిలను వివాహాలు చేసుకుని వారి పేరిట భూములు కొనుగోలు చేసి లాడ్జీలు, రిసార్ట్స్‌లు, షాపులు, పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకొని ఏజెన్సీ ప్రాంతంలో కొంతమంది దర్జాగా చలామణి అవుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. ఆదివాసి మహిళలను వివాహం చేసుకుంటున్నారే తప్ప! కుటుంబమంతా ఒకే దగ్గర రేషన్ కార్డు చేయించుకోకుండా మహిళలకు సపరేటుగా ఎస్టి పేరిట కార్డులు చేయించి వీరి పేరు మీద విచ్చలవిడిగా పనులు చేయించుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. 1/70 భూ బదలాయింపు చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు భూములు కొనడం గాని, విక్రయించడం గాని, శాశ్వత భవనాలు నిర్మించడం కానీ ఎటువంటి హక్కు లేదన్నారు. దీంతో గిరిజనేతరులు తెలివితేటలు ఉపయోగించి ఆదివాసి మహిళలను వివాహాలు చేసుకుంటే వారి పేరిట భూములు ఆక్రమించుకోవడంతో పాటు లాడ్జిలు, రిసార్ట్లు, షాపులు, భవనాలను శాశ్వతంగా నిర్మించుకొని వ్యాపారాలు చేసుకోవచ్చుని గిరిజనేతరులు భావించి ఆదివాసి మహిళలను వివాహాలు చేసుకుంటూ చాప కింద నీరులా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రధానంగా అనంతగిరి, అరకులోయ, హుకుంపేట, పాడేరు, చింతపల్లి, కొయ్యూరు మండలాలతోపాటు, డుంబ్రిగూడ మండలం అరకు సంత బయలులో గిరిజనేతరులు ఎక్కువగా ఆదివాసీ మహిళల పేరిట దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ఈ విధంగా వివాహాలు చేసుకుని గిరిజన చట్టాలను గిరిజనేతరులు అణగదొక్కుతున్నారని

స్థానిక పలు గిరిజన ప్రజా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు తమకు పుట్టిన పిల్లలను సైతం ఎస్టీలుగా కుల ధ్రువపత్రాలను చేయించుకుంటున్నారన్నారు. ఇటువంటి వాటిపై సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, గిరిజనేతరులకు వివాహం చేసుకున్న ఆదివాసి మహిళలకు కూడా వారి భర్తల ఇంటిపేరు మీద, వారి కులాల పరంగానే కుల ధ్రువపత్రాలు మంజూరు చేయాలని పలు గిరిజన సంఘాలు, ఆదివాసి గిరిజనులు కోరుతున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తు తరాల ఆదివాసి గిరిజనులు చాలా రకాలుగా నష్టపోయి మళ్లీ వెనుకబాటుకు గురైే పరిస్థితి వస్తుందని గిరిజన సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తక్షణమే ప్రభుత్వం, ఉన్నత స్థాయి అధికారులు స్పందించి బినామీ బాగోతంపై సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతాం అని ఆయన హెచ్చరించారు.

దేశపాత్రునిపాలెంలో పుట్ట గొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

అనుమతులు లేకుండా ప్లాట్ల క్రయ విక్రయాలు
ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

దేశపాత్రునిపాలెం పోలమాంబ గుడి వెనుక అక్రమ లేఅవుట్

సాయినగర్ కాలనీ సమీపంలో అనధికార వెంచర్

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్లాట్ల విక్రయ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తున్నారు. వీటిలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పక పోవచ్చు. ముఖ్యంగా వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు అనుగుణంగా మార్పు చేయాలంటే ముందస్తు అనుమతి అవసరం. దీనికోసం నగర పంచాయతీ మొదలు ఆర్‌డిఓ కార్యాలయం వరకు ఫైల్ నడవాల్సి ఉంది. అందుకు కొంత సొమ్ము చెల్లించి అనుమతి పొందిన తర్వాతే వ్యవసాయ భూమిని మార్పు చేయాలి. కానీ దేశపాత్రునిపాలెంలో అనేక చోట్ల ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అక్రమ వ్యాపారస్తులు అనధికార లే అవుట్లు వేసి అమ్ముకుంటున్నారు. పోలమాంబగుడి, శేషాద్రినగర్, సాయినగర్ కాలనీ, అశోక్ నగర్ కాలనీ, జాజులవానిపాలెం తదతర ప్రాంతాల్లో 30కి పైగా అక్రమ లేవుట్లు పుట్టుకొచ్చాయి. అందులోని ప్లాట్లు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. వీటిపై అనేక పిర్యాదులు ఉన్నప్పటికీ ఇటు రెవెన్యూ అధికారులు కానీ, అటు టౌన్ ప్లానింగ్ అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. మరో వక్క నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా జరిగిపోతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికీ భారీగానే గండిపడుతోంది. ఫలితంగా ఈ అక్రమ లేఅవుట్లు అధికారులకు, నాయకులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. దేశపాత్రునిపాలెం పరిధిలో అనేక చోట్ల వ్యవసాయ భూమిని ఇంటి స్థలాలుగా మార్పు చేసి క్రయవిక్రయాలు చేస్తున్నారు. వీటిలో సగానికి పైగా ఎటువంటి అనుమతులు లేవు. ఇప్పటికైనా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకొని ప్రభుత్వానికి ఆదాయం చూకూరేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పదాలవానిలక్ష్మీపురంలో పేద దళితులు గత 25 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న జీడి, మామిడి తోటలను ఇటీవల ఫారెస్ట్ అధికారులు అక్రమంగా, దౌర్జన్యం గా నరికివేయడం దారణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారారణ తో కలిసి నరికిన చెట్లను పరిశీలించారు. జరిగిన దౌర్జన్యాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. పేద దళితులు వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి, కష్టపడి జీడి, మామిడి తోటలు వేసి సాగుచేస్తున్నారని, సరిగా ఫలసాయం వచ్చే సమయంలో ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా నరికి పేద దళితులకు తీవ్రంగా అన్యాయం చేశారని తెలిపారు. దీని పై అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా ఫారెస్ట్ అధికారులు స్పందించి పేద దళితులకు చెందిన తోటలు నరికిన ఫారెస్ట్ అధికారులు పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, నష్ట పోయిన దళితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పేద దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తిన నాగేశ్వరరావు, ఎలిపే రాజబాబు, బడుగు సత్యనారాయణ, మోటారు రాజు, వడ్డి రవి కుమార్, బడుగు నాగేశ్వరరావు, బడుగు చిన్న అప్పారావు, బడుగు తాతారావు, ఎలిపే సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు డంప్ నిర్వీర్యం

విశాలాంధ్ర - ఎటపాక: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టుల అమర్చిన డంప్‌ను పోలీసులు ఆదివారం నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారులు వివరాలు వెల్లడించారు. పోలీసులు చెప్పిన కథనం ప్రకారం జిల్లాకి చెందిన డాగ్ స్క్వాడ్, బి. డి. టీం, ఏ. ఎన్. ఎస్. పార్టీ, 42వ బెటాలియన్ క్యాప్ పార్టీ, గ్రౌహండ్స్ సిబ్బంది కలిసి ఆంధ్ర- ఛతీష్ ఘడ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన చింతూరు మండలం, చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లంపేట గ్రామ శివారున గల అటవీ ప్రాంతములో విస్తృతముగా కూంబింగ్ నిర్వహిస్తుండగా దీన్ని కనుగొన్నారు. మావోయిస్టులు పోలీసులపై దాడి చేసి పోలీసులను హతమార్చేందుకు కాలిబాటకు ఇరువైపులా రహస్యముగా వెదురు పొదలకు దగ్గరలో అమర్చిన 07 బూబీ ట్రాప్పును వెలికి తీసి వాటిని అత్యంత చాకచక్యముగా నిర్వీర్యం చేశారు. ఘటనా స్థలం వద్ద మావోయిస్టు కర పత్రాలు, మావోయిస్టు సాహిత్యం లభించినట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి. త్వరలో ఛతీష్ ఘడ్ రాష్ట్రంలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ఛతీష్ ఘడ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల పోలీసులు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారని ఆ క్రమంలోనే దీన్ని పరిశీలించినట్లు చెప్పారు. చాకచక్యంగా 07 బూబీ ట్రాప్పులను నిర్వీర్యం చేసిన రంపచోడవరం రంపచోడవరం ఓఎస్డి మహేశ్వరరెడ్డి, చింతూరు ఏ ఎస్ పీ రాహుల్ మీనా, ఇతర పోలీసు అధికారులు సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

పదో వార్డ్‌లో మన భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్థానిక ఇందిర గాంధీ నగర్ 10 వార్డులో మన భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు 10 వార్డు కార్పొరేటర్ మద్దిల రామ లక్ష్మి రాజశేఖర్ , 10వ వార్డ్ అధ్యక్షులు గాడు అప్పల నాయుడు, ఆధ్వర్యంలో, ఇందిర గాంధీ నగర్ లో ఇంటి ఇంటికి కర పత్రాలు ఇచ్చి పథకాలు తెలియ పరచటమయినది... ఈ కార్యక్రమం లో, తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, రాష్ట్ర కార్యదర్శి అబ్జర్వర్ కర్రినేని అప్పల నాయుడు, అధ్యక్షులు గాడు అప్పల నాయుడు, కార్యదర్శి కేత సత్యనారాయణ, క్లస్టర్ ఇన్చార్జ్ ఎం రాజేష్, యూనిట్ ఇన్చార్జ్ సి హెచ్ శ్రీనివాస్, కొండమ్మ, చిన్న, సుధాకర్, సిహెచ్ అప్పలనాయుడు, ఆలివేలు, వెంకట రావు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు విశాఖలో మెరుగైన చికిత్స....

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పాడేరులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాడేరు ఘాట్ రోడ్ వ్యూ పాయింట్ వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. చెట్టుని తప్పించబోయి ఆర్టీసీ బస్సు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. చోడవరం నుంచి పాడేరు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సులో 21 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. సుమారు 100 అడుగుల లోయలో ఆర్టీసీ బస్సు పడిపోయిందని ప్రయాణికులు చెబుతున్నారు. అయితే ఈ ఘటంలో నలుగురు మృతి చెందగా అనేకమంది గాయాలయ్యాయి. గాయాలైన వారిని మెరుగైన వైద్య సేవల కోసం విశాఖ నగరంలోకి తరలించారు. పాడేరు ఘాట్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయిన వారిని విశాఖ లో కేజీహెచ్ ఆసుపత్రికి, మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు మెడికవర్ ఆసుపత్రిలో ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. మరోవక్క క్షతగాత్రుల బంధువులు, రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడాయి.

ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనపై ఎంపీ మాధవి తీవ్ర దిగ్భ్రాంతి

విశాలాంధ్ర - కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్ లో ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనపై అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాడేరు ఘాట్ రోడ్ లో ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు లోయలో బోల్తా పడిన ఘటనలో పలువురు మృతి చెందిన విషయమై ఎంపీ మాధవి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాటలకందని విషాదం చోటు చేసుకుందని, ప్రమాద ఘటన దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఎంపీ మాధవి ఆదేశించారు. ఎంపీ ఆదేశాలతో ఏపీ ట్రైకర్ డైరెక్టర్ సుర్ల లోవరాజు యువనేత గొడ్డేటి కుమార్ త్రినాథ్ సందీప్ తదితరులు పాడేరు జిల్లా ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టడంతో పాటు వారిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు.

విద్యను ప్రోత్సహిద్దాం... విద్యావంతులుగా తీర్చిదిద్దుదాం

విశాలాంధ్ర - కొయ్యూరు: విద్యను ప్రోత్స హిద్దాం... చిన్నారులను విద్యావంతులుగా తీర్చిదిద్దుదామని సామాజిక సేవకుడు, తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దుమంతి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెం గ్రామంలో అడవి బిడ్డలకు విద్యాదానం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో 24 మంది విద్యార్థులకు పలకలు నోట్ పుస్తకాలు పెన్నులు, పెన్సిళ్ల అట్టలను దుమంతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యావంతులైన నాడే ప్రాంతాల అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లికార్జున్, కిరణ్, సతీష్, దేముడు, తదితర పలువురు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - చోడవరం: స్థానిక స్వయంభూ శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం విశాఖ శంకర్ ఫౌండేషన్ వారిచే నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి.సత్య నారాయణ మూర్తి సహకారంతో ఆలయ అర్చకులు కొడ మంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఉచిత మెగా కంటి పరీక్షల్లో భాగంగా సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. వారిలో 40 మందికి కంటి ఆపరేషన్ అవసరమవ్వగా వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ ఎం.అరుణ్ కుమార్, ఆప్తలమిక్ వైద్య సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో ప్రయోజనాలు



విశాలాంధ్ర - మాకవరపాలెం: వరిలో కాలిబాటలు తీయడం ద్వారా తెగుళ్ల నివారించుకోవచ్చునని ప్రకృతి సేద్య సిబ్బంది సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వరినాట్లు జరుగుతున్న పొలాలను సందర్శించారు. కాలిబాటల వల్ల గాలులకు చేను పడిపోకుండా ఉండటం, దోమపోటును నివారించవచ్చునన్నారు. ఎరువులు, కషాయాలు పిచికారీకి గాలి వెలుతురు బాగా తగిలి దిగుబడి పెరుగుతుందన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

27న ఛలో గాజువాక సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రావికమతం : ఈ నెల 27న చలో గాజువాక సభను విజయవంతం చేయాలని చేనేత సంఘం జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో మండలం చేనేత కార్మిక సంఘం కార్యదర్శి ఉప్పు బాబ్జి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాడుగుల, చోడవరం, బుచ్చయ్యపేట, రోలుగుంట, రావికమతం, మండలాలకు చెంది సుమారు 200 మంది చేనేత కార్మికుల తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు బండారు ఆనందప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు .అయితే వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 50 సంవత్స రముల నిండిన చేనేత కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించే వారన్నారు. అలాగే చేనేత కార్మికులకి గుర్తింపు కార్డులను ఇవ్వడం జరిగిందన్నారు. అయితే గత నాలుగేళ్ల నుంచి 50 సంవత్సరములు పైబడిన చేనేత కార్మికులకు ఏ ఒక్కరికి పెన్షన్ సౌకర్యం కల్పించలేదని పలువురు చేనేత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 6,638 చేనేత కుటుంబాలు ఉన్నాయని, ఈ కుటుంబాలలో 50 సంవత్సరాలు పైబడిన చేనేత కార్మికులు 48 మంది ఉన్నారని తెలిపారు.వారందరికీ పెన్షన్ ఇవ్వాల్సి ఉండగా గత నాలుగువేల నుంచి పలుమార్లు పాలకులు, అధికారులు దృష్టికి, తీసుకు వెళ్లినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని రాష్ట్ర చేనేత సంఘం డైరెక్టర్ పప్పు రమణ సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మగ్గం ఉన్నవాళ్లకే పథకాలు వస్తాయి అనడం ఇది ఎంత వరకు సమంజసమని ఆయన దుయ్యబట్టారు. నేడు బట్టలు తయారు చేయాలంటే అనేక రకాల సాంకేతిక పరిశ్రమలు ఏర్పడడం వలన పేద కార్మికుల పొట్టలు పూర్తిగా కొట్టడం జరిగిందన్నారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించి ఆ జాతి వారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని అన్నారు. అలాగే నేతన్న నేస్తం ఏడాదికి 24 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. కానీ ఇది మగ్గం ఉన్నవాళ్లకే వర్తింపజేసి మగ్గం లేని వాళ్ళకి వర్తింపజేయకపోవడం పట్ల మిగిలిన చేనేత కార్మికులందరూ రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. కాబట్టి చేనేత కార్మిక కులానికి చెందిన ప్రతి కుటుంబానికి వర్తింప చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం నుంచి ఐడి కార్డులను కూడా అందించాలన్నారు. అలాగే గీత కార్మికులకు 50 సంవత్సరాల పైబడిన వారందరికీ పింఛను ఏ విధంగా ఇస్తున్నారో అదే విధంగా చేనేత కార్మికులకు కూడా పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అంతే కాకుండా చేనేత కార్మికులను ఆర్థికంగా అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పించి ఆదుకోవాలని అన్నారు. గత నాలుగేళ్ల నుంచి చేనేత కార్మికుల సమస్యలపై పోరాడుతున్నప్పటికీ, పలుమార్లు అధికారులకు, పాలకులకు విన్నవించుకున్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చేనేత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈనెల 27న చలో గాజువాక చేనేత కార్మికుల సమస్యలపై ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి చేనేత కార్మికులందరూ చేయి చేయి కలిపి, భుజం భుజం తట్టి, ఐకమత్యంతో అందరూ కలిసికట్టుగా వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, జిల్లా చేనేత సంఘ అధ్యక్షుడు మాడెం సూరిబాబు, రాష్ట్ర చేనేత సంఘం డైరెక్టర్ పప్పు రమణ, జిల్లా చేనేత సంఘం డైరెక్టర్ దొడ్డి సురేష్, మండల చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి యు బాబ్జి, ఐదు మండలాలకు చెందిన చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్మికులు పలువురు పాల్గొన్నారు.

పాలకుల వల్లనే పంచ గ్రామాల సమస్య రావణ కాష్టంలా మారింది

విశాలాంధ్ర - పెందుర్తి : పాలకుల వల్లనే పంచ గ్రామాల సమస్య రావణ కాష్టంలా మారిందని 78 వ వార్డు కార్పొరేటర్, సిపిఎం నాయకులు గంగారావు అన్నారు. 94 వార్డు పరిధి వేపగుంటలో సమైక్య రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండు దశాబ్దాల పైబడి పంచ గ్రామాల సమస్య కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల ముందు పాలకుల వచ్చి వాగ్దానం చేసి తరువాత వాటిని మర్చిపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం ముఖ్యమంత్రి కూడా ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలం చెందారని అన్నారు. ఈ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల చిన్న చిన్న మరమ్మతులు చేసుకున్న వాళ్ల కూడా ఇబ్బంది పడుతున్నారు అలాగే బ్రతికున్న సరే తన స్థలంలో ఇల్లు నిర్మించుకునే అవకాశం లేకపోవడంతో భూ యజమానుదారుడు నరకయాతన పడుతున్నాడన్నారు. మనభూమి మన హక్కుపై దేవస్థానం పెత్తనం ఏమిటి అని అసహనం వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో పీఠాధిపతులు కూడా కలుగచేసుకొని పెత్తనం చెలాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం శారదా పీఠాధిపతి వద్దకు వెళ్ళినప్పుడు ఆ సమస్య పీఠాధిపతి పరిష్కరించవచ్చు కదా అని ప్రశ్నించారు. సింహాచలం దేవస్థానంకు 1966, 97 లో ఇచ్చిన రైతు వారి పట్టాలను రద్దుచేసి దేవస్థానం దాడులను అరికట్టాలని 193 సర్వే సెటిల్మెంట్ ఆధారంగా భూ హక్కు దారుణం గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పంచ గ్రామాల ప్రజలు ఐక్యంగా పోరాడి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బి. రమణి,సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి. కృష్ణం రాజు, సి హెచ్ ఎస్ గోపాలకృష్ణ విబిఎన్ ప్రతాప్ బి. అరుణ్ కుమార్ కెఆర్.ప్రసాద్ సిహెచ్ కోటేశ్వరరావు ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు

నిద్రావస్థలో ప్రభుత్వ అధికారులు

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలో ఇసుకాసురులు రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా జీవ నదుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరుపుతున్నను, నియంత్రించాల్సిన ప్రభుత్వ అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు. ఇసుకాసురులు వెనుక అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తో బాటు, ద్వితీయ శ్రేణి వై.కా.పా. నేతలు అడ్డు తగులడంతో, ప్రభుత్వ అధికారులు ఏమీ చేయలేక చేతులు ఎత్తేస్తున్నారనే బహిరంగ రహస్యం వినవస్తోంది. మండలంలోని గజపతి నగరం, జుత్తాడ, గౌరీపట్నం, గవరవరం, ముద్దుర్తి తదితర నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లో పట్టపగలు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. శారద, పెద్దేరు, బొడ్డేరు జీవ నదుల్లో ఇసుక అక్రమంగా జె.సి.బి. యంత్రాలతో తవ్వి, ట్రాక్టర్లతోను టైరు బళ్ళు తోను ఇసుక రవాణా చేస్తూ, ప్రజలకు సాగు తాగు నీటికి అంతరాయం కలిగిస్తున్నారు. అనకాపల్లి - చోడవరం, చీడికాడ ప్రధాన రహదారులు గుండా, నియంత్రించాల్సిన ప్రభుత్వ, వారి కార్యాలయాల ఎదుట నుండి నిరంతరంగా తరలి స్తున్నను, పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వై.కా.పా. ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, భవనాలు ఇతర కట్టడాలు నిర్మాణం చేపట్టే వారు ఇసుక కోసం ఆన్లైన్ లో చలానా కట్టిన తరువాత, నేరుగా లబ్ధి దారులు కోరిన ప్రదేశానికి పంపేవారు. దీని కోసం భూగర్భ గనులు శాఖ ఆధ్వర్యంలో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. జీవ నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, ఇసుక గోతులు వలన తరచూ ప్రమాదాలు సంభవి స్తున్నాయిని స్థానికులు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. తక్షణమే ఉన్నతాధి కారులు, జిల్లా ఇంఛార్జి మంత్రులు శారదా, బొడ్డేరు, పెద్దేరు నదుల్లో అక్రమ ఇసుక తవ్వకాలు నియంత్రించాలని ఆయా నదీ తీర గ్రామస్తులు, ఉభయ కమ్యూనిస్ట్, ప్రజా, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దోమలు సంతాన ఉత్పత్తి చేసే ప్రదేశాలను సమూలంగా నిర్మూలించాలి

జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య

విశాలాంధ్ర - చింతపల్లి : దోమల సంతాన ఉత్పత్తి చేసే ప్రదేశాలను సమూలంగా నిర్మూలించాలని జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో వైద్య ఆరోగ్య సిబ్బంది వారి విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నప్పటికీ దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమల సంతానోత్పత్తి చేసే ప్రదేశాలను సమూలంగా నిర్మూలించేందుకు కంకణం కట్టుకోవాలి అన్నారు. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడేను కొనసాగించాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని, ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రజా అభ్యున్నతికి ఎనలేని వైద్య ఆరోగ్య సేవలు అందించగలవారమని త్రికరణ శుద్ధిగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్, ఏఎంఓసి హెచ్.సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారులు బి.చిట్టిబాబు ఆర్.కన్నబాబు, ఎంపిహెచ్ ఈవో ఎల్.మురళి, ఎంటిఎస్‌లు శ్రావణి, యుగంధర్, ఏఎన్ఎంలు రమణమ్మ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి హామీ

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92 వ వార్డు ఉడా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారం దరూ జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావును మర్యాద పూర్వకంగా కలిసి పార్కు డెవలప్మెంట్ కోసం చర్చించడం జరిగినది. బెహరా సానుకూలంగా స్పందించి త్వరలోనే పార్కును అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 92 వ వార్డు అధ్యక్షులు జి. అప్పలస్వామి నాయుడు ఉడా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారావు, కార్యదర్శి మోహన్ బాబు, క్యాషియర్ చెల్లం నాయుడు, ఉపాధ్యక్షులు సోంబాబు, నాగూర్, శ్రీను, ఆనంద్ కుమార్, లక్ష్మీ నారాయణ, జెసిబి శ్రీను కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని చిన్న మట్లపల్లి పంచాయతీ పరిధిలోని చింతరేగుపల్లి 1,2, గుండు గూడెం, ప్రత్తిపాక, తుష్టివారి గూడెం అంగన్వాడీ సెంటర్ల లో గర్భిణీ స్త్రీలు, బాలింతలుకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు 3కేజీలు, బియ్యం, మంచినూని 1/2 కేజీ, కందిపప్పు 1కేజీ, మల్టీ గ్రీల్ఆటా, వేరు సెనగలు, రాగి పిండి, బెల్లం, ఎండు ఖర్జురాలు ఎంపీపీ కారం లక్ష్మి సర్పంచ్ పిట్ట రామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో, టీచర్స్ పిట్టా. లక్ష్మి, సోడి.నాంచారి, సోడి. సునీత, బోర. సరోజిని, కారం. అనపూర్ణ బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

నత్త నడక సాగుతున్న టవర్ నిర్మాణ పనులు

విశాలాంధ్ర - దంబ్రిగూడ : మండలంలోని కంద్రుం పంచాయతీ సర్రాయి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులు నత్త నడక సాగుతున్నాయి. పనులు ఇంకా పూర్తి కాక సెల్ వినియోగ దారులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాలకు వీలై నంత త్వరగా టవర్ నిర్మాణ పనులు పూర్తిచేసి గిరిజనులకు సెల్ సిగ్నల్ తో పాటు ఇంటర్నెట్ అందుబాటులో తీసుకొచ్చే ధ్యేయంగా చర్యలు చేపడుతుంటే నిర్మాణ పనులు చేపడుతున్న గుత్తేదారుల నత్త నడక పనులు వలన గిరిజన సెల్ వినియోగదారులతో పాటు ప్రభుత్వ అధికారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు అంటున్నారు. టవర్ పనులు పూర్తయిన సిగ్నల్ యంత్రాలు అమర్చలేదని ఈ విషయానికై గ్రామ వార్డు మెంబరు ముత్యం ముద్దుల కృష్ణ మాట్లాడుతూ టవర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడం వలన గిరిజనులకు ఇంటర్నెట్ సదుపాయం ఫోన్ సదుపాయం కలిగి ఉంటుందని అన్నారు.వీలైనంత త్వరగా అధికారులు దృష్టి సారించి టవర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామ వార్డు మెంబరు ముత్యం ముద్దుల కృష్ణ కోరారు.

విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

నూతనంగా ఎన్నికైన పంచాయతీ వార్డు సభ్యురాలు ఝాన్సీ రాణి

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి పంచాయతీ పరిధిలో ఖాళీ ఏర్పడిన నాలుగో వార్డ్‌లో పోటీ చేసిన తనకు మద్దతుగా నిలిచి తన విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని నాలుగవ వార్డు నుంచి తెదేపా బలపరిచి విజయం సాధించిన రీమల ఝాన్సీ రాణి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఖాళీ ఏర్పడిన నాలుగవ వార్డు స్థానంలో జరిగిన ఉప ఎన్నికలలో తనను పోటీకి నిలిపి తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన తెదేపా నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ఓటర్లకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనను నమ్మి ఓట్లేసి గెలిపించిన ఓటర్ల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - రావికమతం : మండలంలో గల కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం అనగా 22వ తేదీ న ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడిఈ ఎల్ అప్పలనాయుడు తెలిపారు. కోత్తకోట సబ్ స్టేషన్‌లో మరామత్తులు చేపడతామని అందువలన ఈ ప్రాంత విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి జాతర (కొలుపు)

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని రాజుపేట పంచాయతీ రాజుపేట కాలనీ గ్రామంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఐదు రోజులపాటు నిర్వహించే ముత్యాలమ్మ జాతర నాలుగవ రోజున ముత్యాలమ్మ తల్లి మహాలక్ష్మి అమ్మ తల్లి మద్దిరామక్క తల్లి తదితర దేవత మూర్తుల విగ్రహాలతో పాటు ముడుపులను గ్రామంలో డప్పు వాయిద్యాలు నడుమ దేవారుల పూనకాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆఖరి రోజు నేడు దేవతల బండి గ్రామంలో ఊరేగించుకుంటూ భక్తజన సమూహం మధ్య ఊరి పొలిమేర వరకు తీసుకెళ్తారు భక్తులు వారి వారి మొ క్కులను అమ్మవార్లకు సమర్పించుకొని గ్రామంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ శారద ఉపసర్పంచ్ ముంజపురాము, ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య రత్న అవార్డుతో జమాల్‌ఖాన్‌కు అమరావతిలో ఘన సన్మానం

విశాలాంధ్ర - చింతూరు : పారంపర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో జాతీయ సాంప్రదాయ వైద్యుల శిక్షణ కార్యక్రమము. నేషనల్ ట్రెడిషనల్ హీలర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ 18.,19,20 తేదీల్లో గుంటూరు జిల్లా, అమరావతి, తాళాయపాలెంలోని శైవ క్షేత్రములో నిర్వహించ బడినది. ఈ సమావేశంలో దక్షిణ భారత దేశంలోని సాంప్రదాయ వైద్యులు అందరూ పాల్గొని వివిధ రకములైన రుగ్మతలకు తాత్కాలిక దీర్ఘకాలిక ఉపశమనము నిర్మూలన అంశాల పైన వారి యొక్క అనుభవ విధానాలను ఒకరి నుండి ఒకరు తెలుసుకున్నారు. సమాజానికి ఆరోగ్య వారతావానికి కాలుష్య రహిత జీవనానికి పర్యావరణ పరిరక్షణకు ఈ పారంపర్య వైద్య సంఘ సభ్యులు పాటుపడాలని వారి యొక్క సందేశాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వృద్ధులైనటు వంటి 70 సంవత్సరములు పైబడిన గురువులకు సన్మానం చేశారు. మరియు ఆంధ్రప్రదేశ్లోని కరోనా మందు ఇచ్చిన ఆనందయ్య ని, ప్రముఖ మూలికా వైద్యులు ఎండి జమాల్ ఖాన్ ని మరియు నెల్లూరుకు చెందిన వేణుగోపాల్ రెడ్డి ని ఫారంపర్య వైద్యరత్న అవార్డుతో పాటు ధన్వంతరి స్వామి పంచలోహ విగ్రహాన్ని బహు కరించారు. వీరి సేవలకు గుర్తింపుగా పరంపర్య వైద్య మహా సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత డాక్టర్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే భవిష్యత్తు కాలంలో ఆయుర్వేదమే మానవాళికి నింపుతుందని ఆయు ర్వేద ఔషధ మొక్కలను కాపాడి భావితరాలకు రోగ రహిత సమాజాన్ని అందించేలా ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఇప్పటికే అడవులు అంత రించి పోయి విలువైన ఔషధ మొక్కలు కోల్పోయామన్నారు. రోజురోజుకు మనిషి పై విస్తృంభిస్తున్న నూతన రోగాల బారిన పడి ఆయు ప్రమాణం తగ్గిపోయిందని రాబోయే కాలంలో మరింత ప్రమాదం ముంచుకొస్తుందని మొండి రోగాలను తరిమికొట్టే ఆయుర్వేద వైద్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సమావేశానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పారంపర్య మహా సంఘం కోశాధికారి బాలకృష్ణ. నిర్వహణ అధికారి రామకృష్ణరాజు కార్య నిర్వహకులుగా ఉన్నారు. అఫ్రిన్ ఆయుర్వేద వైద్య సల నుండి సిబ్బంది మరియు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ ఎం.డి ఇమ్రాన్ ఖాన్ సభ్యులు నాథరాన్, అబ్రార్ ఖాన్, మరియు ఆశ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సయ్యద్ సుబహాని, సిబ్బంది రాచూరి శేఖర్. భవాని, పాష, ఎస్.కె.షాజహాన్, ఎస్కె.సుబహాని పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర - దేవీపట్నం/ రంపచోడవరం : రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం శివారు సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం లో సుమారు 200 మంది వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణా మఠం మేనేజర్ స్వామీ రఘువీరనంద జీ మహరాజ్ మరియు స్వామీ అర్చనానంద మహారాజ్, మెడికల్ క్యాంపులో పాల్గొని మెడికల్ క్యాంపు సేవలను పరిశీలించారు. డా' జి.భాస్కర్ డా.తలారి వెంకట సుబ్బారావు డా.రాయుడు శ్రీనివాస్ డా.ఎస్.సంపత్‌కుమార్‌లు పాల్గొని సుమారు వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. అవసరం అయిన వారికి 25 మందికి రక్తపరీక్షలు 05 గురికి థైరాయిడ్ పరీక్షలు పది మందికి ఎక్స్ రేలు, పది మందికి ఫిజియథెరపీలు చేసినట్లు స్వామీజి తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, మరియు సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు సహాయకులు కు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐఆర్ గంగాధర్ అన్నారు. ఆదివారం అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 79 జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి గంగాధర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ దేశంలో యువతకి 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించి దేశ పాలనలో యువకులకు భాగస్వామి కల్పించారని గంగాధర్ అన్నారు. గ్రామీణ పంచాయతీరాజ్ వ్యవస్థలను పటిష్టం చేయడానికి కేంద్ర నిధులను నేరుగా వచ్చే విధంగా జాతీయ స్థాయిలో సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. గ్రామీణ పంచాయితీ వ్యవస్థ పటిష్టానికి రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని అన్నారు. దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా రాజీవ్ గాంధీ మంచి పాలన అందించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి మండల కమిటీ నాయకులు వీరేశ్వరపు రాంప్రసాద్ మాట్లాడుతూ దేశంలో యువతకి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానాన్ని రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టారని రాంప్రసాద్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ కో-ఆర్డినేటర్ అవినాష్ ఇళ్ళ, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు టేకుప్పుడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ త్రివేది, స్లోచీతా పాడిన మూడో ఒరిజినల్

'మొహబ్బత్' వయాకామ్18 భాగస్వామ్యంతో విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ : వయాకామ్18 సహకారంతో బాలీవుడ్ మెలోడీని హిప్-హాప్ ప్రవాహంతో సమ్మిళితం చేస్తూ పూర్తి సరికొత్త జోనర్‌కు శ్రీకారం చుడుతూ తరాలు నిలిచిపోయే ఒరిజినల్ సౌండ్‌ను తీసుకువస్తోంది రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్. సంగీతం అనేది అన్ని వయస్సుల వారిలో భావోద్వేగాలను రేకెత్తిస్తుంది. సీగ్రామ్ రాయల్ స్టాగ్‌కు ఇది కీలక పునాదిరాయి. ఈ ఆధునిక యుగపు యువ ప్రేక్షకులు ఉత్తేజకరమైన కొత్త సంగీత స్వరూపాలను అన్వేషించడానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. 'లివింగ్ ఇట్ లార్జ్' స్ఫూర్తిని అందిపుచ్చుకొని మణిపాల్, భువనేశ్వర్, పూణే, ఇండోర్ డెహ్రాడూన్‌లోని వేలాది మంది సంగీత ప్రియులను తనదైన ప్రత్యేక అనుభూతి ద్వారా ఆకట్టుకున్న రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్ 4 ఒరిజినల్ మ్యూజిక్ వీడియోలతో తదుపరి దశలోకి ప్రవేశించనుంది. విడుదల చేస్తున్న మూడో ఒరిజినల్ మ్యూజిక్ ట్రాక్ మ్యూజిక్ మ్యాస్ట్రో, అమిత్ త్రివేది, జస్లీన్ రాయల్, స్పంకీ రాపర్ స్లోచీటా మధ్య ప్రత్యేకమైన సహకారంతో రూపుదిద్దుకుంది. కొత్త పాట 'మొహబ్బత్' దేశీ మెలోడీ, హిప్-హాప్ బీట్‌ల సంపూర్ణ సమ్మేళనం ఈ పాట. ఇది ప్రేమలో పడే వివిధ దశలను తెలియజెప్పుంది.

బీజేపీకి రాజీ నామ చేశాను

ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్చార్జ్ నాగమల్లీశ్వరి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్చార్జ్ మంచా నాగమల్లీశ్వరి ఆ పార్టీకి రాజీ నామా చేశారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను గత నాలుగేళ్లుగా భారతీయ జనతా పార్టీలో కొనసాగుతూ వచ్చానని తెలిపారు. తాను ఉన్నత విద్యను అభ్యసించి ఎనిమిదేళ్ళ క్రితం న్యూ హెూప్ ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాలు నచ్చి కొంతమంది పెద్దల ఆహ్వానం మేరకు బిజెపిలోకి రావడం జరిగిందన్నారు. ఓడిపోతానని అనిపించినప్పటికీ కార్పొరేటర్‌గా పోటీ చేశానని, అనంతరం యువమోర్చాలో పని చేసి, ప్రస్తుతం ఎస్సీ మోర్చ ఉత్తర ఆంధ్ర జోనల్ ఇన్చార్జిగా ఉన్నానని తెలిపారు. అయితే పదవులు ఆశించి పార్టీలోకి రాలేదని, పార్టీని అడ్డుపెట్టుకుని ఎలాంటి లబ్ధి పొందలేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో క్రింది స్థాయి నాయకులకు తగిన ప్రాధాన్యత లేకపోవడం కాస్త బాధ అనిపించిన మాట వాస్తవం అన్నారు. ప్రజలకు తన వంతు ప్రయత్నం చేస్తూ, న్యాయం చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో అడుగుపెట్టిన తాను కనీసం దళితులకు గాని మహిళలకు గాని ఎటువంటి న్యాయం చేయలేనప్పుడు పార్టీలో ఉన్న లేకపోయినా ఒకటేనని అన్నారు. నన్ను నమ్మిన కార్యకర్తలకు గాని శ్రేయోభిలాషులకు గాని ఇబ్బంది కలిగించకూడదన్న ఉద్దేశంతో ప్రస్తుత పదవికి, పార్టీకి రాజీనామా చేయడం జరిగిందని తెలిపారు. ఈ రాజీనామా లేఖను ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరికి అందజేయడం జరుగుతుందని చెప్పారు. కాగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ, ప్రస్తుతం పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఇంకా ఏ పార్టీలో చేరాలనేది నిర్ణయించుకోలేదని అన్నారు.

93 పరుగుల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్ విజయం

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాట్స్మెన్ ఎస్.వి.రాహుల్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైజాగ్ లోని డాక్టర్ వైయస్సార్ ఏ సిఏ విడిసిఏ క్రికెట్ స్టేడియంలో ఏపీఎల్ సీజన్ - 2 మ్యాచ్‌లు హుషారుగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్, వైజాగ్ వారియర్స్ జట్లు తలపడ్డాయి. 93 పరుగుల తేడా తో ఘన విజయం సాధించిన ఉత్తరాంధ్ర లయన్స్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. తొలత టాస్ గెలుచుకున్న వైజాగ్ వారియర్స్ ఫీల్డింగ్ ఎన్నుకొని బరిలోకి దిగారు. బ్యాటింగ్ తీసుకున్న ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాట్స్ మ్యాన్లు 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 206 పరుగులు సాధించారు. ఓపెనర్ గా దిగిన బ్యాట్స్ మ్యాన్‌లు సలేహ్ గుల్ఫామ్ నిరుత్సాహపరిచినా కె. యస్. భరత్, మూడో స్థానంలో దిగిన ఎస్ ఎల్.వి.రాహుల్ పార్టనర్షిప్ అద్భుతంగా రాణించింది. టీమ్ కెప్టెన్ కె.యస్. భరత్ 23 బంతుల్లో 4 సిక్స్ లు, 3ఫోర్లు తో 45 పరుగులు చేసి ఔటయ్యాడు. ఎస్. వి. రాహుల్ 36 బంతుల్లో 3సిక్స్ లు, 3 ఫోర్లు తో 53 పరుగులు చేసాడు. మొత్తం మీద 20 ఓవర్లో 6 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేశారు. బ్యాటింగ్ బరిలోకి దిగిన వైజాగ్ వారియర్స్ క్రీడాకారులు 207 పరుగులు టార్గెట్ ను గడిచిన 14.4 ఓవర్లకె ఆల్ ఔట్ అయిపోయి కేవలం 113 పరుగులు చేసి ఓటమి పాలయ్యారు. ఓపెనర్ స్థానంలో దిగిన పి అర్జున్ టెండూల్కర్, మూడో స్థానంలో దిగిన డిబి ప్రశాంత్ తప్ప కెప్టెన్ తో సహా మిగతా వారంతా కొద్ది పాటి పరుగులు చేసి ఉత్తరాంధ్రా లయన్స్ బౌలర్లు చేతిలో ఘోరంగా ఓటమి పాలయ్యారు. బౌలర్లు కూడా సమిష్టిగా రాణించి వైజాగ్ వారియర్స్ జట్టును 14.4 ఓవర్లకే ఆల్ ఔట్ చేసారు. దీంతో ఉత్తరాంధ్రా లయన్స్ టీమ్ వరుసగా మూడు విజయాలను సొంతం చేసుకుంది. ఎస్‌వి.రాహుల్ అద్భుతమైన అర్థ సెంచరీతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు.

జూపూడి దృష్టికి దళిత సమస్యలు

డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ప్రభుత్వ సోషల్ జస్టిస్ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు అనకాపల్లి విచ్చేసిన సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, గంగాధర్ మరియమ్మ, ఈశ్వరరావు జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అజయ్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి సాలువతో సత్కరించే పుష్ప గుచ్చం అందించారు. అనంతరం డివిఎంసి సభ్యులు రేబాక మధు బాబు ప్రభుత్వ ఎస్సీ హాస్టల్స్ పూర్తిగా పాడైపోయాయని అలాగే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో దళితవాడలో తక్షణమే అభివృద్ధి పరచాలని డిఫామ్ ల్యాండ్ పోలింగ్ ద్వారా ప్రభుత్వం తీసుకొని వారికి నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వ అధికారులు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్టేషన్ బెయిల్ రద్దు వంటి వాటిపై జూపూడి ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేబాక ఇంద్రకుమార్, స్టీల్ ప్లాంట్ శేషు కుమార్, బూసి కోటి ఉడతా రాముడు కొత్తపల్లి శ్రీనివాస్ దళిత సంఘాల నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.